

# నా పెళ్లి సమస్య తీరింది

అమ్మమ్మగారి ఊరికి రాకముందు... నాన్నగారికి మళ్ళీ ట్రాన్సఫరు. మరో ఊరు. పల్నాడు ప్రాంతం. కొత్త స్కూల్లో జేరాం. చేరిన పదిహేను రోజులకే ప్యూన్ వచ్చి నా పేరు చదివి 'ఈ అమ్మాయిని హెడ్‌మాస్టరుగారు పిలుస్తున్నారు' అని చెప్పాడు.

నేను అల్లరిపనులు చెయ్యడం, హెడ్‌మాస్టరు పిలిపించి అక్షింతలు వెయ్యడం సర్వసాధారణమే. కానీ కొత్త ఊరు. కొంచెం సెటిల్ అయ్యాక 'నా ప్రభావం చూపిద్దాంలే' అని బుద్ధిగానే ఉన్నాను. మరెందుకు పిలిచారో అర్థంకాలేదు.

పిల్చాక వెళ్ళక తప్పదుకదా మరి. వెళ్ళాను. నన్నేకాదు చాలామందిని పిలిచారు. అందరం నిశ్శబ్దంగా నిలబడ్డాం. హెడ్‌మాస్టారు తలవంచుకుని కుర్చీలో కూర్చున్నారు. పక్కనే నిలబడ్డ మేళ్ళచెరువు మాస్టారు 'పిల్లలొచ్చేశారు చెప్పండి, పిల్లలొచ్చేశారు చెప్పండి' అంటున్నారు. హెడ్‌మాస్టారేమో ఏమీ చెప్పరు.

అలా కాసేపు నుంచోబెట్టి గట్టిగా నిట్టూర్చి 'మీ క్లాసులకి వెళ్ళండి' అన్నారు హెడ్‌మాస్టారు. క్లాసుల కొచ్చేశాం. ఎందుకు పిలిచారో తెలియక అవస్థపడ్డాం.

మర్నాడూ అంతే. మళ్ళీ పిలిచారు. వెళ్ళాం. మళ్ళీ అదే తంతు. హెడ్ మాస్టారు తల వంచుకుని కుర్చీలో, బొమ్మల్లా ఎదురుగుండా మేమందరం. "పిల్లలొచ్చేశారు చెప్పేయండి. ఏం ఫర్వాలేదు చెప్పేయండి పిల్లలొచ్చేశారు" అంటూ పక్కనించీ మేళ్ళచెరువు మేస్టారి గొడవ.

కాసేపయ్యాక మళ్ళీ నిట్టూర్చి'మీ క్లాసులకి వెళ్ళండి' అన్నారు హెడ్ మాస్టారు. నాకు చిరాకేసేసింది. మేళ్ళ చెరువు మేస్టారి అమ్మాయి సుజాత మా క్లాసే. మీ నాన్నగారి వ్యవహారం నాకేం నచ్చలేదు. పనిమాలా పిలిపించి 'చెప్పండి చెప్పండి' అని ఏవిటో చెప్పకుండా పంపించడం. 'ఇవతల మాకు చదువులు పాడవటంలేదూ!' అని దెబ్బలాడాను.

"సరే నేను కనుక్కుంటాలే" అంది సుజాత.

మర్నాడు మమ్మల్ని పిలవలేదు.

"నిన్న రాత్రి మా నాన్నతో దెబ్బలాడానులే" అంది సుజాత.

మూడోనాడు అసెంబ్లీ మీటింగులో మళ్ళీ అదే గొడవ. 'పిల్లలందరూ ఉన్నారు చెప్పండి' అని మేళ్ళచెరువు మాస్టారి గోల. హెడ్మాస్టారేమో ఏమీ చెప్పరు.

ఇక లాభంలేదనుకున్నారేమో. మేళ్ళచెరువు మాస్టారే చెప్పేశారు. "చూడండి పిల్లలూ. మీకో ముఖ్యమైన విషయం చెప్తున్నాను. శ్రద్ధగా వినండి. మన హెడ్మాస్టారి రెండో అమ్మాయికి వివాహం నిశ్చయం అయింది. పాపం మన మాస్టారు చాలా మంచివారు. బహు సంతానం. ఆర్థికంగా దీనస్థితి. అందుకే మీరంతా మీ పెద్దవాళ్ళని అడిగి ఏదైనా సహాయం చెయ్యండి. ఇంత అని బలవంతం ఏమీలేదు. మీకు తోచినంత ఇస్తే చాలు" అని చెప్పారు. హెడ్మాస్టారుగారు తలవంచుకున్నారు.

ఇంటికి వెళ్ళగానే యథాతథంగా అమ్మతో చెప్పాను. వరలక్ష్మి వ్రతం అని అమ్మమ్మా తాతయ్యా కూడా వచ్చి ఉన్నారు.

అందరూ విన్నారు. "అట్లాగా! పాపం ఎంత ఇబ్బందిలో ఉండి అడిగారో! ఎంతోకొంత ఇచ్చి పంపించు" అన్నారు నాన్నగారు. "అలాగే" అంది అమ్మ. మర్నాడు అన్నయ్యకి పన్నెండూ నాకు ఎనిమిదీ ఇచ్చింది. న్యాయంగా చెరో పదీ ఇవ్వచ్చు.

కానీ నేను సెకండ్ఫారం. అన్నయ్య ఫోర్త్ఫారం. ఆ మాత్రం తేడా ఉండాలిట.

"పోనీ పాపం! నేనూ చెరో వరహా ఇచ్చి పంపిస్తాను" అంటూ తాతయ్య ఇద్దరికీ చెరో నాలుగు రూపాయలూ ఇచ్చారు. అమ్మమ్మ చెరో రూపాయీ ఇచ్చింది. అవన్నీ భద్రంగా తీసికెళ్ళి హెడ్‌మాస్టారుగారికి ఇచ్చాం. పక్కనే ఉన్నారు మేళ్ళచెరువు మాస్టారు. ఎవరెంత ఇచ్చారో ఒక కాయితం మీద రాస్తున్నారు.

"ఎంతయినా పెద్దవారి బుద్ధులు ఉదారంగానే ఉంటాయి" అన్నారు మెచ్చుకోలుగా.

హెడ్‌మాస్టారు మమ్మల్ని దీవించారు. ఆ తరవాత వారం పదిరోజులు స్కూల్లో అదే చర్చ–'నువ్వెంతిచ్చావంటే నువ్వెంతిచ్చావు.'

ఎంతో కొంత అందరూ ఇచ్చేశారు. బాగానే వచ్చిందట.

"మీరు దిగులుపడకండి. మేమందరం తలో చెయ్యీ వేస్తాం. అవసరం అయితే పక్కూళ్ళకి కూడా కబురు పంపిస్తాం" అని హెడ్‌మాస్టారికి ధైర్యం చెప్పారుట మేళ్ళచెరువు మేస్టారు. సుజాత నాతో చెప్పింది.

నాకు ఎందుకో దిగులేసింది.

ఇంటికి వెళ్ళగానే "అమ్మమ్మా! నా పెళ్ళి ఎప్పుడు చేస్తారు" అని అడిగాను.

"బాగానే ఉంది. పెళ్ళంటే మాటలా? మీ నాన్న ముప్పూతిప్పలు పడి మూడు చెరువులు నీళ్ళు తాగితే గానీ అవదు నీ పెళ్ళి" అంది అమ్మమ్మ.

పుస్తకాల సంచీ అవతల విసిరేసి ముసుగుతన్ని పడుకున్నాను. ఏడుపు వచ్చేసింది. 'అమ్మా–నాన్నగారిని చూడాలనుంది' అని ఏడుపు. ఫెళఫెళ్ళాడుతూ జ్వరం వచ్చేసింది. అమ్మ కంగారుపడిపోయింది. వెంటనే మనిషిని పంపించింది– కేంపుకి వెళ్ళిన నాన్నగారికోసం. అమ్మమ్మా, అమ్మా నా పక్కనే కూర్చున్నారు.

తెల్లవారుతూనే నాన్నగారొచ్చేశారు. ఆయన్ని చూసి నాకు దుఃఖం ముంచుకు వచ్చింది. "ఏమ్మా! ఏవిటీ చెప్పు?" అని బతిమాలారు నాన్న.

"నాన్నా! మా హెడ్‌మాస్టారుగారికి మేమందరం ఉన్నాం, మేష్టర్లున్నారు. మరి మీకెవరున్నారు నాన్నా? ఇద్దరు సూపర్‌వైజర్లు, ఇద్దరు మేస్త్రీలు, మన జవాను వెంకటప్పడు, జవాను జబీర్ ఖానూ, డ్రైవరు తాతయ్య, గేదెని కాసే కోటప్ప. ఇంతేగా. వీళ్ళందరూ ఎంతిస్తారు? మీరు డబ్బులెక్కణ్ణించి తెస్తారు? నాకు పెళ్ళి ఎట్లా చేస్తారు?" అని భోరున ఏడిచాను.

అందరూ తెల్లబోయి–తరవాత ఒకటే నవ్వు.

"భగవంతుడా! నా కూతురికి ఈ అతి తెలివితేటలేవిటీ తండ్రీ" అంది అమ్మ.

"భయపెట్టి చంపావుకదుటే" అని నాన్న.

తాతయ్య దగ్గర కూర్చుని "ఆయనేదో కానిరోజులు వచ్చి అందర్నీ అడిగాడు అంతే. నీకేం. మీ నాన్న మహరాజు" అన్నారు.

"అవునవును. దేశదేశాలు గాలించి రాజకుమారుడిని తెచ్చి ఏనుగు అంబారీ మీద ఊరేగించి, ఆకాశం అంత పందిరేసి ఆర్భాటంగా చేస్తారు నీ పెళ్ళి. వీధులు కట్టి విస్తళ్ళు వేసి పప్పన్నం పెట్టి పంపిస్తారు" అంది అమ్మమ్మ.

"అయితే అందరూ తలో చెయ్యీ వెయ్యక్కర్లేదన్నమాట" అన్నాను.

"చాల్లే వెధవ్వాగుడూ నువ్వూనూ" అంది అమ్మ.

తిడితే తిట్టిందిగానీ నిజం తెలుసుకుని నా మనసు తేలికపడింది.

* * *